ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 03.05.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

**1.** ఈరోజు దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష రాష్ట్రంలో ప్రశాంతంగా ముగిసింది.

2. ఈ నెలాఖరులో రెండవ దశ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు.

**3.** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 8 వేల 575 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 12 లక్షల 38 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ తెలియజేసింది.

**4.** ఐపిఎల్ క్రికెట్ లో ఈరోజు సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరుగుతున్న మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయింది.

**నీట్ పరీక్ష**

ఈరోజు దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష రాష్ట్రంలో ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ పరీక్షలో ఒక్క నిమిషం నిబంధనను అధికారులు కఠినంగా అమలు చేశారు. రాష్ట్రంలోని 24 పట్టణాల్లో ఉన్న 199 కేంద్రాల్లో నీట్ నిర్వహించారు. హైదరాబాద్‌లోనే 69 పరీక్ష కేంద్రాలున్నట్లు ఎన్‌టీఏ వర్గాలు తెలిపాయి. తెలంగాణలో 73 వేల మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు.

డెస్క్

**పొంగులేటి**

ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా, కూసుమంచిలో ఈరోజు నిర్వహించిన ప్రజా దర్బార్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత రెండున్నర సంవత్సరాల్లో పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామని, వాటిని మరింత ప్రజలకు చేరువ చేయడానికి 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక చేపట్టామని అన్నారు. ఈ నెలాఖరులో రెండవ దశ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, మూడవ, నాలుగవ దశల్లో కూడా ఇళ్లు మంజూరు కొనసాగుతాయని, ప్రతి అర్హుడికి ఇల్లు అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

పిటిసి, ఖమ్మం

**ధాన్యం**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 8 వేల 575 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 12 లక్షల 38 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు రాష్ట్ర  పౌర సరఫరాల శాఖ తెలియజేసింది. వీటికి గానూ.. రైతులకు కనీస మద్దతు ధర కింద 1,129 కోట్ల రూపాయల పైచిలుకు చెల్లింపులు చేసినట్లు వెల్లడించింది.

డెస్క్

**గవర్నర్**

హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఈరోజు జరిగిన ఉచిత కృత్రిమ అవయవాల శిబిరానికి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో మేక్ ఎ చేంజ్ ఫౌండేషన్, శ్రీ స్వామినారాయణ ఆలయం వంటి సీఎస్ఆర్

భాగస్వాముల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 745 మంది లబ్ధిదారులకు 815 నారాయణ మాడ్యులర్ కృత్రిమ అవయవాలు, కాలిపర్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పరేడ్‌లో గవర్నర్ స్వయంగా లబ్ధిదారులతో మాట్లాడి వారిని ప్రోత్సహించారు.

**డెస్క్**

**కరీంనగర్లో కాల్పుల కలకలం**

కరీంనగర్ లోని ఓ నగల వస్త్రాల షాపులోకి దుండగులు చొరబడి, సిబ్బందిపై కాల్పులు జరిపి భారీ మొత్తంలో ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలకు గురి చేసింది. రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన నలుగురు దుండగులు జ్యువెలరీ షాపులోకి వచ్చి, షాపు సిబ్బందిపై తుపాకులతో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో పలువురు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలోనే షాపులోని విలువైన నగలను దుండగులు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అదే సమయంలో కరీంనగర్ లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. కాల్పుల సమాచారం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లారు. షాపు సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆ తరువాత పోలీస్ కమిషనర్ తోపాటు స్థానిక పోలీసులతో మాట్లాడారు.

డెస్క్

**నిరసన ఉప సంహరణ**

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల కారణంగా ఎల్లుండి నిర్వహించనున్న నిరసన కార్యక్రమంతో పాటు అన్ని రకాల నిరసన కార్యక్రమాలను ఉపసంహరించుకుంటున్నట్లు ఉద్యోగ సంఘాల నేతలు ప్రకటించారు. తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ, తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న రాత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే

ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి తారీఖునే వేతనాలు అందించే చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత రెండేళ్లలో 67 వేల 760 ఉద్యోగ నియామకాలు చేపట్టామని, వంద రోజుల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద 6 వేల కోట్ల రూపాయలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. పీజున్ 1 లోగా ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కార్డులు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

డెస్క్

**పూర్వ ప్రాథమిక పాఠశాలల ప్రారంభం**

ఆసిఫాబాద్ జిల్లాలో జాతీయ విద్యా విధానం 2020 అమలులో భాగంగా పూర్వ ప్రాథమిక పాఠశాలలు ప్రారంభిస్తున్నట్లు జిల్లా అకాడమిక్ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ తెలిపారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ...

బైట్ ... జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్

పిటిసి, ఆసిఫాబాద్

**హరీష్ రావు**

నిబంధనల పేరుతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. ఈరోజు సిద్దిపేట-కరీంనగర్ రాజీవ్ రహదారిపై  ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్న రైతులకు హరీష్ రావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని, 28 రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదని రైతులు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కలెక్టర్లకు ఆర్డర్ ఇచ్చి వడ్ల కొనుగోలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

పీటీసీ, సిద్దిపేట

**వాతావరణం**

ఈరోజు ఆదిలాబాద్, జనగాం, కరీంనగర్, ఖమ్మం, కొమరం భీమ్ ఆసిఫాబాద్,

మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జిల్లాలో గంటకు 40 కిలో మీటర్ల వేగంతో గాలులు, ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో కూడా గంటకు 60 కిలో మీటర్ల వేగంతో గాలులు, మోస్తరు ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

**పీఎస్**

**వడగళ్ల వాన**

నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం ఒక్క సారిగా ఈదురు గాలులతో వడగళ్ల వాన కురిసింది. దీంతో ప్రజలు ఎండవేడిమి నుంచి కొంత ఉపశమనం పొందినప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దయ్యింది. గాలి వానతో పలు ప్రాంతాలలో ఇళ్ల రేకులు గాలికి ఎగిరి పోయాయి. పండు దశలో ఉన్న మామిడి రాలిపోయింది.

పిటిసి, నల్గొండ

**మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా, మందమర్రిలో ఈ సాయంత్రం ఉరుములు, మెరుపులతో గాలివాన కురిసింది. రహదారిలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లు నెలకొరగడంతో రాకపోకలకు అంతరాయం కలుగగా, విద్యుత్ స్తంభాలు కిందపడటంతో పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మందమర్రి రైల్వే స్టేషన్ లోకి నీళ్ళు చేరాయి.

పిటిసి, మంచిర్యాల

**రాజన్న సిరిసిల్ల జిల్లా**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలతో ఏర్పడే విద్యుత్ అంతరాయాల నివారణకు ప్రత్యామ్నాయంగా 33 కేవీ ఇంటర్ లింక్ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని

సూపరింటెండెంట్ ఇంజనీర్ వేణు మాధవ్ తెలిపారు. విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి 13 కొత్త సబ్ స్టేషన్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. రైతులకు 902 నూతన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు విడుదల చేసినట్లు తెలిపారు.

పిటిసి, సిరిసిల్ల

**ఐపిఎల్**

సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య ఈరోజు హైదరాబాద్ లో జరుగుతున్న మ్యాచ్ లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సన్ రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయింది. కోల్‌కతా నైట్ రైడర్స్ గెలవాలంటే 166 పరుగులు చేయాల్సి ఉంది.

డెస్క్

**సబ్ స్టేషన్లో మంటలు**

నల్లగొండ జిల్లా, వెంకటాద్రిపాలెం లోని సబ్ స్టేషన్లో ఈ మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు రావడంతో అప్రమత్తమైన సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మంటలు భారీగా ఎగసి పడుతుండటంతో సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

పిటిసి, నల్గొండ

**ప్రశాంతంగా నీట్ పరీక్ష పూర్తి**

నీట్ 2026 పరీక్ష కోసం నల్లగొండ జిల్లాలో 2 వేల 38 విద్యార్థుల కోసం 6 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1985 మంది పరీక్షకు హాజరయ్యారు.

జనగామ జిల్లాలో ఈరోజు ప్రశాంత వాతావరణంలో నీట్ పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.

పిటిసి, నల్గొండ, జనగామ

**వనపర్తి జిల్లా**

వరి, మొక్కజొన్న చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని వనపర్తి శాసనసభ్యులు తూడీ మేఘారెడ్డి పేర్కొన్నారు. ఈరోజు శ్రీరంగాపూర్, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

పిటిసి, వనపర్తి

**నల్లగొండ జిల్లా**

ఆరోగ్యంగా ఉండడమే మనిషికి గొప్ప సంపద అని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ఈరోజు 2కె, 5కే, 10 కే రన్ లను జిల్లా ఎస్.పి శరత్ చంద్ర పవార్ తో కలిసి ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి రన్ లు నిర్వహించడం సంతోషమని, ప్రతి ఒక్కరూ యోగాను కూడా దైనందిన జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని అన్నారు.

పిటిసి, నల్గొండ

**చుక్క సత్తయ్య విగ్రహ్ ఆవిష్కరణ**

తెలంగాణ జానపద కళాకారూపాలను ఒగ్గు కథగా మార్చి,12 వందలకు పైగా ప్రదర్శనలు ఇచ్చిన గొప్ప కళాకారుడు చుక్క సత్తయ్య విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఈరోజు జనగామలో విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతిని, ఒగ్గు కథను చుక్క సత్తయ్య విశ్వ వ్యాప్తం చేశారని కొనియాడారు.

పిటిసి, జనగామ

**నిర్మల్ జిల్లా**

నిర్మల్ జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఈరోజు వేసవికాలం తాగునీటి సరఫరాపై సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎక్కడైనా ప్రజలకు త్రాగునీరు అందించడంలో

ఇబ్బందులు ఎదురైతే, అధికారులు వెంటనే స్పందించి, సమస్యను పరిష్కరించాలని సూచించారు. నీటి సరఫరా పైపులకు లీకేజీలు, మరమ్మత్తులు ఉంటే రిపేర్లు చేపట్టాలన్నారు.

పిటిసి, నిర్మల్

**ఉద్యోగాల భర్తీ**

రాజన్న సిరిసిల్ల జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలోని మిషన్ వాత్సల్యలో పలు పోస్టుల భర్తీకి ఈనెల 6న పలు రకాల పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తెలిపారు. ఫలితాల అనంతరం ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అర్హుల జాబితాను రేపు వెబ్ సైట్ లో, నోటీసు బోర్డుపై ఉంచుతామని పేర్కొన్నారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల